క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లికి చెందిన కొప్పు బుచ్చయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం మండల వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య జ్యోతికి వైస్ ఎంపీపీ అనంతరెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.ఈ కార్యక్రమంలో మంగళపల్లి ఉపసర్పంచ్ సాయికుమార్, నాయకులు మురళి, గణేశ్ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేవరకు పోరాటం: ఎమ్మార్పీఎస్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

యాచారం: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ శ్రేణులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన పాదయాత్ర నవంబర్ 7న హైదరాబాద్ నగరానికి చేరుకుంటున్న దృష్ట్యా జరిగే బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు యాచారంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, ఆనంద్, రాకేష్, యాదయ్య, తరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లాకాంగ్రెస్ నాయకులు భగవాన్‌రెడ్డి, అంజయ్యగుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు విఠలయ్యగౌడ్, యాదగిరిరెడ్డి, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ‘ఉప్పల’ చేయూత



నగదు అందజేస్తున్న ఎంపీపీ నిర్మల, ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన అక్షయ చదువుకు ఆర్థిక సహాయం అందజేస్తానని ఇటీవల ఉప్పల తెలిపారు. బుధవారం ట్రస్టు సభ్యులచే హైదరాబాద్‌లో రూ.10,000 అక్షయకు అందజేశారు. అదేవిధంగా నీట్‌లో సీటు సాధించి కళాశాల ఫీజులు కట్టలేక మథన పడుతున్న మరో నిరుపేద విద్యార్థికి రూ.15,000 అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందు, బుచ్చిబాబు, మల్లేశ్, నర్సింహ, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మా కాలనీలో సెల్‌టవర్ వద్దు

కమ్మగూడలో స్థానికుల ఆందోళన

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి కమ్మగూడ 19వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ అనుమతిని వెంటనే రద్దుచేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. కాలనీలో టవర్ నిర్మాణ పనులను బుధవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. ఇళ్ల మధ్యలో టవర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని, కాలనీవాసుల సమ్మతి తీసుకోకుండా ఎలా అనుమతులు మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై టౌన్ ప్లానింగ్ అధికారి అలీ పాషా మాట్లాడుతూ సదరు నిర్మాణదారులకు డీమ్డ్ అనుమతి లభించిందని దీన్ని వెంటనే రద్దుచేస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లోని వైఎస్ఆర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆ కాలనీవాసులు బుధవారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా గోపాల్, అధ్యక్షుడిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా రమావత్ బాలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా బద్రు, సహాయ కార్యదర్శిగా పెద్దిరాజు, కార్యవర్గ సభ్యులుగా ఇంద్రసేన, చంద్రునాయక్, అజీజ్‌పాషా, కృష్ణ, పాండు, విష్ణు, కాంత్ ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం పోలీసులు బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో మాల్ కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా డబ్బు తరలింపుపై తనిఖీలు చేపడుతున్నారు. గునుగల్ గేట్, యాచారం పోలీస్ స్టేషన్ ముందు కూడా పోలీసులు తనిఖీలు చేపట్టారు.

గల్లీకో బెల్టుషాపు

- గ్రామాల్లో యథేచ్ఛగా నిర్వహణ
- ప్రతి బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 వరకు అదనపు వసూళ్లు
- తూతూమంత్రంగా పోలీసుల దాడులు
- కట్టడిచేయాలంటున్న ప్రజలు



తాడిపర్తిలోని ఓ బెల్టు దుకాణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

యాచారం: గ్రామాల్లో బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టకపోవడం, స్థానిక పోలీసులు మనకెందుకులే అనే ధోరణితో వ్యవహరిస్తుండటంతో మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. గ్రామాల్లో బెల్టుదుకాణాల వద్ద మందుబాబులు తెల్లవారకముందే క్యూ కడుతున్నారు. యాచారం మండలంలో 24 గ్రామ పంచాయతీలు, మరో 24 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 400కు పైగానే బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల వ్యాపారులు నిత్యం మాల్, యాచారం, నక్కర్తమేడిపల్లి, గునుగల్ గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాల వద్దకెళ్లి రూ.లక్షలు పెట్టి మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మద్యం వ్యాపారులు కూడా బెల్టు దుకాణాలతో కుమ్మక్కై ఎక్కువ సేల్ కోసం బెల్టు దుకాణాలకు ఉద్దెర(అప్పు)పై మద్యాన్ని అందిస్తున్నారు. యాచారం, మాల్, నందివనపర్తి, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి, నల్లవెల్లి, చింతుల్ల, గునుగల్, చౌదర్‌పల్లి, తాడిపర్తి, మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లి తండా, కొత్తపల్లి, గడ్డమల్లయ్యగూడ, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో బెల్టు దుకాణాలు లెక్కలేనన్ని ఉన్నాయి.

రూ.50 లక్షలకు పైగానే..

గ్రామాల్లోని బెల్టు దుకాణాలన్నిటిలో కలిసి రోజుకు రూ.50 లక్షలకు పైగానే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో దుకాణంలో రూ.50వేల వరకు మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక గ్రామాల్లో శుభకార్యాలు, బోనాలు, బొడ్రాయి పండుగ, పెళ్లిళ్లు జరిగితే రూ.లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. బెల్టు దుకాణాల్లో ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100కు పైగానే అదనంగా వసూల్ చేస్తారు. మంచి లాభాలు ఉండటంతో బెల్టు దుకాణాల వ్యాపారులు పోలీసులకు కూడా లంచాలు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లోని బెల్టు దుకాణాలతో యువత మద్యానికి బానిసై చెడిపోతున్నారు.

పోలీసుల దాడులతో..

ఇటీవల యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ల పోలీసులు గ్రామాల్లోని బెల్టు దుకాణాలపై దాడులు చేశారు. దాడుల్లో భారీగా మద్యం బాటిళ్లు బయట పడుతున్నాయి. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు బుధవారం తాడిపర్తి గ్రామంలోని బెల్టు దుకాణాలపై చేసిన దాడుల్లో 86 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. దాడుల విషయాన్ని పసిగట్టిన మిగితా దుకాణందారులు నిల్వ చేసి ఉన్న మద్యాన్ని ఇతర ప్రాంతాల్లో దాచిపెట్టేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని బెల్టు దుకాణాలను కట్టడి చేయకపోతే రాజకీయ నాయకుల మధ్య ఘర్షణలు, దాడులు జరిగే అవకాశాలు ఉంటాయి. బెల్టు దుకాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం ఇవ్వండి



గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యానికి అలవాటు పడిన యువత పూర్తిగా చేడిపోతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నాయి. బెల్టు దుకాణాలు నిర్వహించే వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టు దుకాణాలపై ధైర్యంగా సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

– రామాంజనేయులు, సీఐ, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

బీఆర్ఎస్‌కి రాష్ట్ర ప్రజలే బాస్‌లు

- నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్, బీజేపీలకు బాస్‌లు ఢిల్లీలో ఉంటే బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలే బాస్‌లని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బొంగులూర్ ప్రమిదా గార్డెన్‌లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ కన్వీనర్లు, కోకన్వీనర్లతోపాటు సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కుర్చీల కుమ్ములాటలు తప్ప ప్రజలకు ఒరుగబెట్టిందేమీ లేదన్నారు. బీజేపీకి రాష్ట్రంలో ఏమాత్రం బలం లేకున్నా పార్టీ అధ్యక్ష పదవుల కోసం కుమ్ములాటలు మార్పులు, చేర్పులు చూసామన్నారు. స్థిరమైన నాయకత్వం, పాలనతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గడిచిన తొమ్మిళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఏ విధంగా ప్రగతి సాధించిందో ప్రజలకు వివరించాలన్నారు. 50 రోజులు పార్టీ కోసం కష్టపడితే ఐదేండ్లు ప్రజల కోసం నిస్వార్థంగా సేవచేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీలు కృపేష్, నర్మద, జెడ్పీటీసీ జంగమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



నిరసన తెలుపుతున్న అంజయ్య, నాయకులు

యాచారం: ఉపాధి కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. యాచారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఉపాధి కూలీలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేసి నాలుగైదు నెలలు గడుస్తున్నా కూలీలకు డబ్బులు అందడం లేదని అన్నారు. ఉపాధి కూలీలకు ఆధార్ అనుసందానంతో ఆందోళన వ్యక్తమవుతుందని అన్నారు. ఉపాధి పనులకు బడ్జెట్ తగ్గించడం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, శివ, కృష్ణ, లక్ష్మణ్, బ్రహ్మయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న పాడిరైతులు

కడ్తాల్: పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బిల్లులు చెల్లించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం మెనేజర్ రాధికను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని వేలాది మంది రైతులు సాగుతో పాటు కుటుంబానికి తోడ్పాటుగా ఉంటుందని పాడిపోషణ చేపట్టి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో పాడి రైతులకు పాల బిల్లురాక 11 రోజులయిందని.. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా పాలసేకరణ కేంద్రాల్లో మొబైల్‌యాప్ ఎంటర్ చేయడానికి కార్యదర్శులకు అనేక ఇబ్బందులు తలెత్తుతు న్నాయని.. ఒక్కో రైతుకు సంబంధించి డాటా ఎంటర్ చేయడానికి 5 నిమిషాల సమయం పడుతుందని.. వేతన కార్యదర్శులకు పూర్తి వెసలుబాటు కల్పించాలని వారు కోరారు. పాడిరైతుల సంఘం నాయకులు రామకృష్ణ, నాయకులు సుధాకర్‌యాదవ్, జితేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, రంగా, లక్ష్మన్, చంద్రయ్య, నారాయణరెడ్డి, ఘాంస్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

జేబీఎస్‌కు స్పెషల్ బస్సులు

డీఎం అశోక్‌రాజు



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నుంచి జేబీఎస్ వరకు గురువారం నుంచి స్పెషల్ బస్సులను ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ అశోక్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం నుంచి జేబీఎస్‌కు వెళ్లే 279 రూట్‌లో ప్రత్యేకంగా 10 అదనపు బస్సులను వేస్తున్నామని.. కేవలం తొమ్మిది బస్టాప్‌ల వద్దనే ఈ బస్సులు ఆగుతాయన్నారు. బొంగుళూరు, యంజాల్, బీఎన్‌రెడ్డి, సాగర్ రింగ్‌రోడ్డు, ఎల్బీనగర్,ఉప్పల్, నాగోల్, తార్నాక, సికింద్రాబాద్ స్టేజీల వద్దనే బస్సులు ఆగుతాయన్నారు. దీంతో ప్రయాణికులకు సమయం తగ్గుతుందన్నారు. జేబీఎస్‌కు ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నడిపిస్తామన్నారు.

జైపాల్‌యాదవ్ గెలవాలని..

యాదగిరిగుట్ట నరసింహ స్వామి ఆలయంలో రాంపూర్ గ్రామస్తుల పూజలు



యాదగిరిగుట్ట ఆలయంలో రాంపూర్ గ్రామస్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్ గ్రామస్తులు బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ సర్కార్ రావాలని, నియోజకవర్గంలో జైపాల్‌యాదవ్ ఎమ్మెల్యేగా గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదయ్య, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ శ్రీశైలంయాదవ్, ఆలయ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రామదాసు, తిరుపతయ్య, కొమరయ్య, ఆంజనేయులు, పాండు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ముసుగు పడింది

ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఆమనగల్లు మున్సిపాలిటీ అధికారులు రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగిస్తున్నారు. గోడలపై ఉన్న రాజకీయ పార్టీల పేర్లు, నినాదాలు కనిపించకుండా సున్నం వేస్తున్నారు. అలాగే రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అన్ని పార్టీల నాయకులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ కోరారు.

– ఆమనగల్లు:



గోడలపై రాతలకు సున్నం వేస్తూ..



నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్‌గా చెన్నకేశవులు



చెన్నకేశవులుకు నియామకంపత్రం అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ చైర్మన్‌గా మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన మిడత చెన్నకేశవులును నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి కడ్తాల్‌లో చెన్నకేశవులకు బుధవారం నియామకంపత్రం అందజేశారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ బలోపేతానికి చెన్నకేశవులు ఎంతో కృషిచేశాడని పేర్కొన్నారు. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి అంకిత భావంతో పనిచేశాడని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తింపుగా జిల్లా ఎస్సీసెల్ చైర్మన్ రాజ్‌కుమార్ ఆదేశానుసారం మండల ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. చెన్నకేశవులు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన వంశీచంద్‌రెడ్డి, జిల్లా ఎస్సీ చైర్మన్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్యానాయక్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, యూత్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, రమేష్, ఆరీఫ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

గొర్ల పెంపకందారుల జిల్లా కార్యవర్గ సభ్యుడు పెంటయ్య

తలకొండపల్లి: హక్కుల సాధనకు ఉద్యమించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లెల పెంటయ్యయాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పడకల్‌లో మాట్లాడుతూ.. గొల్ల కురుమలకు గొర్రెల పథకం ద్వారా ఇవ్వాల్సిన జీవాలు మొదటి విడత పూర్తి కాకపోగా, రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టకపోవడం దారుణమన్నారు. 50 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికి రూ.5వేల పింఛన్, ప్రమాదంలో చనిపోయిన పెంపకందారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రతి గొర్రెలకాపరికి రూ.లక్షతో షెడ్ నిర్మించాలని, గొర్రెల ఫారం ఏర్పాటుకు రూ.30 లక్షల రుణం, గొర్రెలకు ఇన్సూరెన్స్, ప్రతి గ్రామ సొసైటీకి కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంపకందారుల సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు సింగిల్‌విండో డైరెక్టర్ జంగమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో జంగమ్మను బుధవారం సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్త పరామర్శించారు. జంగమ్మ కుమారుడు రమేశ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆర్థికసాయం అందించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన



కడ్తాల్: గ్యారంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ పథకాలను అమలు చేసి చూపిస్తామని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అన్మాస్‌పల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వంశీచంద్‌రెడ్డితో, ఎమ్మెల్సీ కసిరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆరు గ్యారంటీ పథకాలపై కరపత్రాలతో ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మాయామాటలతో ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగించిందని విమర్శించారు. ఈ సందర్భంగా అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రావుల రాజుగౌడ్, యాదయ్య యాదవ్‌తో పాటు పలువురు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్‌లుపాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. అందరూ ఏకతాటిపై నడిచి కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



తుర్కయంజాల్: ప్రచారం నిర్వహిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీములను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. బుధవారం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, సునీల్, నాయకులు ధన్‌రాజ్ గౌడ్, శివకుమార్, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

తలకొండపల్లి: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలుపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ గెలుపును ఎవ్వరూ ఆపలేరని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 80 నుంచి 86 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై ఇబ్రహీంపట్నంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు పరిచే స్కీంల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, నాయకులు కృష్ణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.